క్లుప్తంగా

గుడుంబా స్వాధీనం

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన సోదరి గంగరాజు వద్ద బుధవారం 60 లీటర్ల గుడుంబాను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో వాహన తనిఖీలు చేస్తుండగా గంగరాజు వద్ద దాదాపు రూ.24 వేల విలువ గల గుడుంబా లభించిందన్నారు. ఈ మేరకు గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

నిందితులను శిక్షించాలి



మంగపేట: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్న దైవ సమానురాలైన వైద్యురాలిపై ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉరిశిక్ష విధించాలని పేర్కొన్నారు. దేశంలో ఇలాంటి సంఘటనలో మరెక్కడ కూడా జరుగకుండా ఉండేందుకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కఠినతరమైన చర్యలు అమలు చేయాలన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన సర్గన రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ప్రవీణ్, మావురపు తిరుపతిరెడ్డి, రేవంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



కన్నాయిగూడెం: మండలంలోనరి కొండాయి గ్రామానికి చెందిన నిరుపేద మామిడి సమ్మయ్య ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆర్థిక సాయం కోసం దాతలను కోరగా ముప్పనపల్లి సహాయ నిధి సభ్యుడు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.ఐదు వేలు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆస్పత్రి వద్ద అందజేశారు.

చెక్కు అందజేత



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన మూసాపురి సరోజనకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేశ్ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సరోజన కొంత కాలం క్రితం అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. దీంతో ఆమె ఆర్థికంగా నష్ట పోవడంతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 45వేలు నిధులను మంజూరు చేయించారని రమేశ్ తెలిపారు. ఈ మేరకు సరోజనకు చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డె శంకర్, పువ్వాడి హరికృష్ణ, కొడెల రాయమల్లు, వేణువంక శ్రీదేవి, ఉప్పుల కిరణ్, గురుకుంట్ల కిరణ్, జెన్నె యుగేందర్, రాయిని శ్రీకాంత్, మూసాపురి రవి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మంగపేట: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లూరులో చోటుచేసుకుంది. ఎస్సై టీవీఆర్‌సూరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆళ్ల జయంత్ (26) వ్యవసాయంలో రూ.4 లక్షల వరకు నష్టం రావడంతో పాటు నూతనంగా రూ.8 లక్షలతో ఇంటిని నిర్మించాడు. దీంతో రూ.12 లక్షల వరకు అప్పులు కావడంతో అప్పులు చెల్లించే విషయంపై కుటుంబ సభ్యులతో చర్చించి అప్పులు చెల్లించలేననే మనస్థాపంతో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వాజేడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని దీంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ హాస్టళ్లల్లో విద్యార్థినులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులను రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు. జ్వరం దగ్గు, జలుబు లాంటివి వస్తే వెంటనే వైద్యశాలకు రావాలని సూచించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతం తెలుసుకోవడానికి పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ నవీన్ హాస్టళ్లలోని విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, రాజేశ్వరి, హాస్టళ్ల సిబ్బంది పాల్గొన్నారు.



వాజేడు: కేజీబీవీలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల, నూగూరు, ఆలుబాక, తిప్పాపురం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉంటున్నారు, వారిలో ఎవరైన జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాలను సర్వే చేశారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, స్నేహ, ఆశీష్, వినయ్, వైద్య సిబ్బంది జ్యోతి, మనోహర్, తదితరులు ఉన్నారు.



వాజేడు: ట్రైబల్ వెల్ఫేర్‌లో..



వెంకటాపురం(కె)లో..

బాలల హక్కులను పరిరక్షించాలి

గోవిందరావుపేట: బాలల హక్కులను పరిరక్షించాలని ఎంపీడీఓ జవహర్‌రెడ్డి అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమిరెడ్డి, సీడీపీఓ మల్లేశ్వరీ, డా.చంద్రకాంత్ మాట్లాడుతూ.. బాలలకి స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచడం మన అందరి బాధ్యత అన్నారు. గ్రామ స్థాయిలో బాలల హక్కుల కమిటీలను పర్యవేక్షించేందుకు మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో, మండలాల్లో నిస్సాహాయ స్థితిలో ఉన్న బాలలకు తోడు ఉండేలా కమిటీలో చర్చించుకోవాలని అన్నారు. పిల్లల సమస్యలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థలను నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ కమిటీలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, డీసీపీయూ సోషల్ వర్కర్ జ్యోతి, కిశోర బాలలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ జవహర్‌రెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మంగపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై టీవీఆర్ సూరీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన చింతకుంట, ద్వితీయ బహుమతి సాధించిన రాజుపేట జట్లకు బుధవారం సీఐ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సే నో టు డ్రగ్స్ వాల్‌పోస్టర్‌ను సీఐ ఆవిష్కరించి మాట్లాడారు. యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో డ్రగ్స్ జాడలు కలకలం రేపుతున్నాయన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ విక్రయాలు, వినియోగాలపై యువత సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించే వారికి నగదు పారితోషికం అందిస్తామని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



విజేతలకు షీల్డును అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

‘ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకం’



మంగపేట: రాజుపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకమని మాల మహానాడు మండల అధ్యక్షుడు సాధనపల్లి చిట్టిబాబు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిట్టిబాబు మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎంపీలతో చర్చించి నిర్ణయం తీసుకోకుండా అందుకు విరుద్ధంగా చేయటం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, లక్కుమల్ల మోహన్, మోతుకూరి రాజు, యన్నమల్ల రవి, గుండమల్ల రమేష్, రమణయ్య, సాధనపల్లి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె)లో..

మంగపేట: మండలంలోని రాజుపేటలో మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై బుధవారం నిరసన తెలిపారు. దీంతో అరగంట పాటు ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పల్లికొండ యాదగిరి, కర్రి శ్రీనివాస్, గంగెర్ల రాజారత్నం, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

మంగపేట: ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు గాదె శ్రీనివాసాచారి అన్నారు. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉద్యమకారుల ఫోరం మండల నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల స్థితిగతులపై చర్చించి త్వరలో రాజేపేట నుంచి జిల్లా కేంద్రం వరకు నిర్వహించనున్న ఉద్యమకారుల చైతన్య యాత్ర విధి విధానలపై చర్చించారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యమకారులకు ఇచ్చిన హామీని సత్వరమే అమలు చేసేందుకు చేపట్టనున్న పోరాట కార్యక్రమపై భవిశ్యత్ కార్యాచరణపై చర్చించారు. స్వరాష్ట్ర సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చైతన్య యాత్రలో పాల్గొని ఐక్యమత్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా, మండల నాయకులు ఏడుకొండలు, రాజెందర్, వెంకన్న, లింగయ్య, వాసుదేవమూర్తి, రాజయ్య, రవీందర్, ఎస్కే అబ్జల్, కేశవరావు, రాంబాబు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వైద్యాధికారిపై దాడికియత్నం

● వ్యక్తిపై కేసు నమోదు



వైద్యాధికారితో మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్

మంగపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి వైశాలిపై అసభ్యకరంగా వ్యవహరించి దాడిచేసేందుకు యత్నించిన పొదుమూరుకు చెందిన ముకుందం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టీవీఆర్ సూరీ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి బుధవారం ఓపీ నిర్వహిస్తున్న సమయంలో వైద్యం కోసం వెళ్లిన ముకుందం దురుసుగా వ్యవహరించి విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని తనపై దాడి చేసేందుకు ప్రయత్నించాడని వైద్యాధికారిని ఫోన్ చేసి తెలిపిందన్నారు. వెంటనే హెడ్‌కానిస్టేబుల్ సూరయ్య, కానిస్టేబుల్ ప్రసాద్ పీహెచ్‌సీకి పంపించి ముకుందంను అదుపులోకి తీసుకుని విచారించి అతడిపై న్యూసెన్స్ కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క హామీ మేరకు అంగన్‌వాడీల పదవి విరమణ నూతన జీఓ వచ్చే వరకు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లను కొనసాగించాలని అన్నారు. జూలై నెలలో విధులు నిర్వహించిన వారికి వేతనం చెల్లించలేదని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ నిబంధనల మేరకు మినీ అంగన్‌వాడీ టీచర్లు మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ పొందినప్పటికీ మినీ అంగన్‌వాడీ టీచర్ వేతనం అందిస్తున్నారని పేర్కొన్నారు. వేతన విషయంలో అధికారుల పనితీరుతో అంగన్‌వాడీలు గందరగోళానికి గురవుతున్నారని వాపోయారు. పదవి విరమణకు సంబంధించి అధికారులు ప్రామాణికంగా తీసుకున్న రికార్డుల ప్రకారం వయసు తేడాలు గుర్తించేందుకు బోన్ పరీక్షలు సమ్మశక్యంగా లేవని అన్నారు. కార్యక్రమంలో సరోజన, సమ్మక్క, వెంకటరమణ, రమాదేవి, రోహిణి, సత్యనారాయణమ్మ, సరోజ, లక్ష్మి, సారమ్మ, రజిత పాల్గొన్నారు.

చేయూత



సారయ్యకు నగదు అందజేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని గుర్రేవుల గ్రామానికి చెందిన నిరుపేద లేగల సారయ్య కూతురు వివాహానికి బీఆర్ఎస్ నాయకులు చేయూతనందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రూ.30 వేలు, పార్టీ నుంచి రూ.10 వేలు మొత్తం రూ.40 వేలను బుధవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాముల వెంకన్న కుమారుడికి ప్రమాదవశాత్తు చేయి విరుగగా అతడికి రూ.ఐదు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, నారాయణ, సీనియర్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, మటం వెంకటేశ్వర్లు, పూజరి కిషోర్, జగన్, బొగ్గుల నిరంజన్, శ్రీనువాస్, సుమణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీలో జోరుగా ఇసుక దందా..

ములుగు రూరల్: ఏజెన్సీలో అధికార పార్టీ నాయకులు మంత్రుల అండదండలతో ఇసుక, మొరం దందాలు జోరుగా చేపడుతున్నారని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణ చేపడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లాలో అధికార పార్టీ నాయకులు చేపడుతున్నా అక్రమ దందాలపై అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. ఇసుక క్వారీలను ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని అన్నారు. జిల్లాకేంద్రంలోని మాదవరావుపల్లి సమీపంలో ప్రభుత్వ భూమిలో మొరం తోడుకుంటూ అమ్మకాలు చేపడుతున్న మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు అటువైపు తొంగిచూసిన దాఖలాలు లేవని అన్నారు. రాత్రి 10 గంటల తరువాత నుంచి ఉదయం 06 గంటల వరకు మొరం అక్రమ రవాణా చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాదం కుమార్, రాజ్ కుమార్, నాగరాజు, హేమాద్రి, కిషోర్, దేవ్‌సింగ్, ప్రవీణ్, మహేష్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్

పోలీస్‌స్టేషన్‌కు సీసీ కెమెరాల బహూకరణ

ఏటూరునాగారం: నేరాలను నియంత్రించేందుకు సోషల్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి మనోజ్ కుమార్ స్థానిక ఎస్సై తాజొద్దీన్‌కు సీసీ కెమెరాలను బుధవారం బహూకరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రూ.55వేల విలువ చేసే సీసీ కెమెరాలను ఆయన అందజేశారు. సేవా కార్యక్రమాలలో భాగంగా సీసీ కెమెరాలను అందజేసినట్లు మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, దొంగతనాలు నిర్మూలించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్స సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు అందజేస్తున్న మనోజ్‌కుమార్

కారుణ్యనియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు, అధికారులు

భూపాలపల్లిరూరల్: భూపాలపల్లి ఏరియా సింగరేణి ఎక్స్ ఎంప్లాయిస్ డిపెండెంట్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. బుధవారం సాయంత్రం సింగరేణి జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై 14 మంది డిపెండెంట్లకు జీఎం సయ్యద్ అబీబ్ హుస్సేన్‌తో కలిసి ఎమ్మెల్యే కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. అదేవిధంగా, వివిధ కారణాలతో మరో నలుగురు డిస్మిస్ కాగా, వారిని కూడా తిరిగి విధుల్లోకి తీసుకోడానికి నియామక ఉత్తర్వు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్ఓటు జీఎం వెంకటరామిరెడ్డి, పర్సనల్ మేనేజర్ మారుతి, జీఎం కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఓసీపీలో వన మహోత్సవం

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–2లో బుధవారం మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ హాజరై మొక్కలు నాటారు. పచ్చదానాన్ని పెంచి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. పచ్చదనం లేకుంటే వాతావరణం కాలుష్యమై అనారోగ్యాల పాలవుతారని.. మొక్కలు పెంచాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు వెంకటరామిరెడ్డి, నజీర్, పోషమల్లు, కృష్ణయ్య, ప్రశాంత్, జోగు బుచ్చయ్య, నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

బోనాలతో వెళ్తున్న మహిళలు



మొక్కులు సమర్పిస్తున్న భక్తులు



ఏటూరునాగారం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు పోచమ్మ తల్లి బోనాల పండుగను బుధవారం వైభవంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న ముత్యాలమ్మ(పోచమ్మ)తల్లి, ఆకులవారిఘణపురంలోని పోచమ్మ తల్లికి భక్తులు బోనాలను డప్పుచప్పుళ్ల మధ్య సమర్పించారు. బెల్లం, పసుపుతో తయారు చేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఊరేగింపుగా బోనాలను తలపై పెట్టుకొని శివసత్తుల కోలాటంతో బయలుదేరారు. చీరె సారెలను అప్పగించి కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. రావిచెట్టుకు ముడుపులు కట్టారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



చిట్యాల: వాహనదారులు రోడ్డ భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై షాఖాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై బుధవారం వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానితుల వివరాలను తెలుసుకుని వదిలేశారు. వాహన పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆయన వెంట సివిల్, టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.